

ఒకే కాన్పులో ముగ్గురు జననం



ప్రజాశక్తి- కాకినాడ: ఐ.పోలవరంకు చెందిన దంపతులకు ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించారు. గురువారం రమ్య హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హస్పటల్ అధినేత డాక్టర్ ప్రభావతి వివరాలను వెల్లడించార. ఐ.పోలవరం చెందిన వీరబాబు, నాగ వీరజ్యోతి దంపతులకు నాలుగేళ్ల కిందట వివాహమైంది. జ్యోతి గర్భవతి కావడానికి అవకాశం తక్కువగా ఉన్నట్లు గుర్తించి మందులు వాడించినట్లు తెలిపారు. తొలిసారి జ్యోతి గర్భం దాల్చగా ఆమెకు 9 నెలలు పూర్తి కావడంతో సిజరియన్ ఆపరేషన్ చేయగా ముగ్గురు పిల్లలు జన్మించడం జరిగిందన్నారు. వీరిలో ఇద్దరు బాబులు ఒక పాప ఉందన్నారు. తల్లీపిల్లలు క్షేమంగా ఉన్నారని ఆమె తెలిపారు.

పిఠాపురం నుంచే పవన్ పోటీ



- స్పష్టం చేసిన జనసేనాని
- భగ్గుమన్న టిడిపి శ్రేణులు
- కాకినాడ సీటుపై రాని స్పష్టత
- ఎంపీ స్థానంపైనా కొనసాగుతున్న ఉత్కంఠ



పిఠాపురంలో ఎన్నికల మెటీరియల్, ఫ్లెక్సీలను దహనం చేస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

కొంతకాలంగా అదిగో, ఇదిగో అంటున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎట్టకేలకు పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు నోరు విప్పారు. గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన పిఠాపురం నుంచి పోటీపై స్పష్టత ఇచ్చారు. దీంతో పిఠాపురం నియోజకవర్గంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. పవన్ కళ్యాణ్ ను భారీ మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపుతామని బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ ఎంపిగా కూడా బరిలో ఉంటారని ప్రచారం జరగడంతో ప్రస్తుతానికి ఎంపీగా పోటీ చేసే ఆలోచన లేదని పవన్ కళ్యాణ్ తెలిపారు. దీనిపై కూటమి పెద్దలతో మాట్లాడాక తుది నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.

ఆది నుంచీ పవన్ కళ్యాణ్ పిఠాపురంలో పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారు. తన వారాహి యాత్ర సందర్భంగా శ్రేణులకు ఈ మేరకు సంకేతాలు కూడా ఇచ్చారు. ఇక్కడే మూడు రోజులు గడిపారు. గత ఇన్‌ఛార్జ్ మాకినీడి శేషుకుమారుని మార్పు చేసి టీ టైం అధినేత తంగేళ్ల ఉదయ శ్రీనివాస్‌ను ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. పవన్ కళ్యాణ్ పోటీ చేయడానికి అనుకూలంగా ఉండడం కోసమే ఆయన్ను నియమించారని మొదట నుంచి ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల పిఠాపురం నుంచి పోటీపై అతి త్వరలో ప్రకటన చేయనున్నారని కూడా ప్రచారం గట్టిగా జరిగింది. గొల్లప్రోలు సమీపంలో మూడు ఎకరాలు లీజుకు తీసుకుని హెలీప్యాడ్ కోసం స్థలాన్ని కూడా సిద్ధం చేశారు. దాంతో పవన్ పిఠాపురం నుంచి పోటీ దాదాపుగా ఖాయమైనట్లు ప్రచారం ఊపందుకుంది. జనసేన శ్రేణులు కూడా పవన్ పిఠాపురం నుంచి పోటీ చేయాలంటూ వివిధ సందర్భాల్లో ప్రకటనలు ఇచ్చారు. అందుకు తగ్గట్టుగా తాజాగా అధినేత ఇక్కడ నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపిలో అసంతృప్తి సెగలు

పిఠాపురం నుంచి తాను పోటీ చేస్తున్నట్లు పవన్ కళ్యాణ్ స్పష్టం చేయడంతో ఇక్కడ టిడిపి నుంచి టికెట్ ఆశిస్తున్న వర్మ వర్గీయులు గురువారం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. నియోజకవర్గ కేంద్రంలో ఉన్న టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ జెండాలు, కరపత్రాలను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ ఫ్లెక్సీలను తొలగించి మంటల్లో వేశారు. వర్మకు టికెట్ దక్కకపోవడంతో ముకుమ్మడిగా రాజీనామాలు చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. టిడిపి ఇన్‌ఛార్జ్, ఆ పార్టీ అధికార ప్రతినిధి వర్మ ముఖ్య నాయకులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తన భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న వర్మకు కాకుండా పొత్తులో భాగంగా స్థానికేతరుడైన పవన్ కళ్యాణ్ ఇక్కడ నుంచి పోటీ చేస్తే ఓడించి తీరతామంటూ పలువురు టిడిపి శ్రేణులు ఈ సందర్భంగా హెచ్చరించారు. పార్టీకి కష్టపడి పని చేస్తూ చంద్రబాబుని, లోకేష్‌ని నమ్ముకుంటే ఇలా అన్యాయం చేస్తారా? అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహిళా కార్యకర్తలు అసభ్య పదజాలాలతో సైతం దూషించారు. గాజువాక, భీమవరం స్థానాల నుంచి గతంలో ఓడిన పవన్ కళ్యాణ్ దమ్ముంటే అక్కడ నుంచి పోటీ చేసి గెలవాలి తప్ప వర్మ నియోజకవర్గం నుంచి పోటీ చేయడమేంటని ప్రశ్నించారు. ఇప్పటికే వర్మ అనుచరులు స్థానికుడికే ఓటు వేసి గెలిపించుకుంటామంటూ ఇతర వివరాలు లేకుండా ఒక నినాదంతో మాత్రమే నియోజకవర్గం అంతా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన తరుణంలో తాజా పరిణామాలను పరిశీలిస్తే మాజీ ఎంఎల్ఎ వర్మ టిడిపికి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉండే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణులు స్పష్టం చేస్తున్నారు.

కాకినాడ సిటీ నియోజకవర్గంపై రాని స్పష్టత

టిడిపి అధినేత చంద్రబాబు గురువారం 24 మందితో రెండో జాబితాను విడుదల చేశారు. ప్రత్తిపాడులో వరుపుల సత్యప్రభకు ఎట్టకేలకు టికెట్ ఖరారు చేశారు. కాకినాడ జిల్లాలో మిగిలిన కాకినాడ సిటీ నియోజకవర్గంపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ నియోజకవర్గంపై అనేకమంది ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తనకే టిక్కెట్ దక్కుతుందనే ధీమాతో ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని నియోజకవర్గాల్లో టికెట్లు ఆశించి భంగపడిన ఆశావాహులు సీటుని ఆశిస్తున్నట్లు సమాచారం. అందువలనే రెండో జాబితాలో కూడా ఈ స్థానాన్ని చంద్రబాబు ప్రకటించలేదు. ప్రముఖ కాంట్రాక్టర్ గుణ్ణం చంద్రమౌళి, ఇతర ప్రముఖులు ఈ నియోజకవర్గంపై ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు బిజెపి కూడా కాకినాడ సిటీ టిక్కెట్‌ను అడుగుతున్నట్లు సమాచారం. అందువల్లే సిటీ నియోజకవర్గంపై చంద్రబాబు ఎటూ తేల్చలేదు. మరోవైపు కాకినాడ పార్లమెంటు స్థానంపైనా ఉత్కంఠ కొనసాగుతోంది. కూటమి అభ్యర్థి ఎవరనేది ఇప్పటికీ స్పష్టత రాలేదు. ప్రముఖ వ్యాపారవేత్త సానా సతీష్ బాబు పోటీలో ఉండే అవకాశం ఉందని రెండు పార్టీల శ్రేణులు చెబుతున్నాయి. బిజెపితో పొత్తు ఖరారైన నేపథ్యంలో పవన్ కళ్యాణ్ కాకినాడ ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తారని కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. దాంతో ఎవరు ఇక్కడి నుంచి పోటీ చేస్తారు? అభ్యర్థి ఎవరు అనేది ఇంకా స్పష్టత రాకపోవడంతోనే తాజాగా ప్రకటించిన జాబితాలో కాకినాడ పార్లమెంటు స్థానానికి కూడా చోటు దక్కలేదు.



అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న ఆందోళనాకారులు

చలో ఢిల్లీకి మద్దతుగా ధర్నా

-మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపుమేరకు మార్చి 14న రైతాంగ చలో ఢిల్లీకి మద్దతుగా ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. గురువారం రైతు, కార్మిక, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో ఇంద్రపాలెం లాకుల వద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు, ఉభయ తెలుగు రాష్ట్రాల ఐఎన్‌టియుసి ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పు ఆదినారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. ప్రధాని మోడీ ఇచ్చిన హామీ, స్వామినాథన్ ప్రతిపాదనల మేరకు రైతుల పంటలకు కనీసం మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ఉపాధిహామీ పథకాన్ని రెండు వందల రోజులకు పెంచి రోజుకు 600 వేతనం చెల్లించాలన్నారు. పట్టణాలకు విస్తరింప చేయాలని, కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా పంట రుణాలు, వంట నష్టం, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, కేరళ ప్రభుత్వం తరహా రైతుల పంటలకు రుణ ఉపశమన చట్టం చేయాలని, రైతాంగ ఉద్యమం సందర్భంగా చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిజెపి మోడీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తే రైతుల పంటలకు కనీస మద్దతు ధర చెల్లిస్తామని 2014 ముందు మోడీ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. వ్యవసాయ సంక్షోభ నివారణకు తన జీవితాన్ని అంకితం చేసిన ఎంఎస్ స్వామినాథన్ చేసిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోకుండా ఆయనకు భారతరత్న బిరుదు ఇస్తే ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. గత 10 ఏళ్ల కాలంలో 1 లక్షా 60 వేల మంది రైతులు వ్యవసాయం గిట్టుబాటుకాక ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. మోడీ అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ విధానాలను అడ్డుకోవాల్సిన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీ భజనలో మునిగి తేలుతున్నా యని అన్నారు. కేంద్రంలోని మోడీని, రాష్ట్రంలో మోడీ విధానాలను బలపరుస్తున్న పార్టీలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వ శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధి కారి మలకా రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, సామాజిక ఉద్యమ కారులు ఐయితాబత్తుల రామేశ్వంరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగ సూరిబాబు, సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్తా రాజశేఖర్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎస్ శ్రీనివాస్, ఎఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుంచె అంజిబాబు, రైతు కూలి సంఘం నాయకులు వల్లూరి సత్తిబాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి బోద కొండ, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కేసవరపు అప్పలరాజు, పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఒరిమి రమణ, కాంట్రాక్టు లేబర్ యూనియన్ సాయి, ఐఎన్‌టియుసి నాయకులు సాయిరెడ్డి, ఎఐసిసిటియు జిల్లా నాయకులు నరసరాజు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రూ.14.27 కోట్లు జమ

ప్రజాశక్తి - కాకినాడ



మహిళలకు మెగా చెక్‌ను అందిస్తున్న కలెక్టర్

జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కులా లకు చెందిన 9,516 మందికి మహిళలకు రూ.14.27 కోట్ల ను జమ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా తెలిపారు. గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో జరిగిన కార్యక్రమంలో సిఎం జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రెడ్డి, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ, వెలమ ఇతర ఒసి కులాలకు చెందిన 45-60 సంవత్సరాల మధ్య ఉన్న పేద మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద ఏటా రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, ఎస్‌సి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మజీ, పెరిక కార్పొరేషన్ చైర్ పర్సన్ పురుషోత్తం గంగాభవాని, కూడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఇడి ఎ.శ్రీనివా సరావు, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాతా..మనవరాలి మధ్యే పోటీ

-సిట్టింగ్ ఎంఎల్ఎ ఆశీస్సులు ఎవరికో..!



వరుపుల సుబ్బారావు



వరుపుల సత్యప్రభ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపాడు నియోజకవర్గంలో తాత, మనవరాలు మధ్య పోటీ రసవత్తరంగా మారనుంది. నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా వరుపుల కుటుంబం నుంచే ఇరు పార్టీల అభ్యర్థులు పోటీ పడడం ఇదే మొదటిసారి. ప్రత్తిపాడు నియోజకవర్గ ఏర్పడినప్పటి నుంచి పర్వత, వరుపుల, ముద్రగడ కుటుంబాల మధ్యనే అధికారం ఉంటూ వచ్చింది. గతంలో పర్వత కుటుంబానికి ముద్రగడ మద్దతు ఇస్తే వరుపుల ఓటమి చెందేవారు. ముద్రగడ కుటుంబానికి పరుపుల మద్దతిస్తే పర్వత కుటుంబం ఓటమిని చవిచూసేది. గత ఎన్నికల్లో అనూహ్యంగా వరుపుల సుబ్బారావు తన మనవుడు వరుపుల రాజాను కాదని పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌కు మద్దతు ఇవ్వడంతో ఆయన గెలుపొందారు. అనంతరం ఎంఎల్ఎ ప్రసాద్ తన విజయంలో కీలక పాత్ర పోషించిన వరుపులను దూరం పెట్టారు. తన మనవడు వరుపుల రాజా ఆకస్మికంగా మృతి చెందడంతో వరుపుల సుబ్బారావు అతని భార్య సత్య ప్రభను గెలిపించి పర్వత ప్రసాద్‌పై కక్ష తీర్చుకుంటారని అందరూ భావించారు. కాని ఈ ఎన్నికల్లో మేనల్లుడు ఎంఎల్‌సి అనంత ఉదయభాస్కర్ ప్రోద్బలంతో వరుపుల సుబ్బారావు ప్రత్తిపాడు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను చేజిక్కించుకున్నారు. టిడిపి మొదటి జాబితాలో వరుపుల రాజా భార్య సత్యప్రభ పేరు లేకపోవడంతో రాజకీయంగా ఏ మలుపులు తిరుగుతాయోనని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో టిడిపి రెండో జాబితాలో చంద్రబాబు సత్య ప్రభను ప్రత్తిపాడు అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో తాత, మనవరాలు మధ్య పోటీ అనివార్యంగా మారింది. పర్వత వర్గం మద్దతు వీరిలో ఎవరికి లభించనుందనే చర్చ నియోజకవర్గంలో ఆసక్తిని రేపుతోంది. సత్యప్రభకు రాజా భార్యగా, ఆయన చనిపోవడంతో సింపతి, విద్యావంతురాలుగా, ఏలేశ్వరం వాస్తవ్యరాలిగా, ప్రత్తిపాడు కోడలుగా మంచి సంబంధాలు ఉండడం కలిసి వచ్చే అంశాలు కాకా, వరుపుల సుబ్బారావు గత రెండు పర్యాయాలు ఎంఎల్ఏగా చేసిన అనుభవంతో పాటు అందరినీ పేరుపేరునా పలకరించే స్వభావం కలిసొచ్చేఅంశాలుగా ఉన్నాయి. కిర్లంపూడి మండలం ప్రత్తిపాడు నుంచి విడిపోవడంతో ముద్రగడ ప్రభావం అంత మేర ఉండకపోయినా పర్వత ఆశీస్సులు కోసం ఇరు వర్గాలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తాత, మనవరాలి మధ్య పోటీలో నియోజకవర్గ ప్రజల తీర్పు ఎలావుంటుందో ఎన్నికల ఫలితాల వరకూ వేచిచూడాల్సిందే.



కాకినాడలో మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్

ప్రజాశక్తి - కాకినాడ, కాకినాడ రూరల్

మహోన్నత వ్యవక్తి కారల్ మార్క్స్ అని సిపిఎం నాయకులు అన్నారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్‌లో కారల్ మార్క్స్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సిపిఎం నాయకులు, కార్యకర్తలు మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా ఏకంకండు, పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప అనే పిలుపును మార్క్స్ ఆనాడే ఇచ్చారని తెలిపారు. మార్క్స్ రాసిన పెట్టుబడి పుస్తకం ఇప్పటికి ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. సోషలిస్టు సమాజమే ప్రజలందరి సమస్యలు తీరఃస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కెఎస్.శ్రీనివాస్, కె.వీరబాబు, టి.ఈశ్వరరావు, కె.సింహాచలం, టి.రాజా, ఎం.జి.సూరిబాబు పాల్గొన్నారు. కాకినాడ రూరల్ బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో కార్ల్ మార్క్స్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ మార్క్స్ ఆలోచనలు, సిద్ధాంతాలు వాటి తదుపరి అభివృద్ధి సమిష్టిగా మార్క్సిజం అని పిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, శిరీష, వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఆర్‌బికెను ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తాళ్లరేవు



కాంట్రాక్టర్‌ను సత్కరిస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ

స్థానిక సచివాలయం-2 పరిధిలోని రైతు భరోసా కేంద్రాన్ని ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ ప్రారంభించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన సేవలు అందించేందుకే ఆర్‌బికెలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆర్‌బికెలో అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్‌బికెను నాణ్యతతో నిర్మించిన కాంట్రాక్టర్ బొంతు శ్రీనివాస్‌ను ఎంఎల్ఎ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థులు కోడింగ్‌లో ఉత్తమ ప్రతిభ



నగదు బహుమతిని అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సిఎస్‌సి విభాగంలో 2వ ఏడాది చదువుతున్న విద్యార్థులు పుస్పెంద్ర బిరాజీ. సంజయ్ దాస్ కోడింగ్‌లో ప్రతిభను చాటారు. నేపాల్‌లోని లో గ్రీన్ ల్యాండ్ ఇంటర్నేషనల్ కాలేజీలో నిర్వహించిన టెక్నికల్ పోటీలో బెస్ట్ వెబ్ డెవలప్‌మెంట్ అవార్డుని కైవసం చేసుకుని రూ.6 వేలు నగదు బహుమతిని అందుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్. రమాశ్రీ, విభాగాధిపతి డాక్టర్ ఎ.వానతి, అధ్యాపకులు విజేతలను అభినందించారు.

సత్యప్రభ అభ్యర్థిత్వంపై హర్షం

ప్రజాశక్తి - రౌతులపూడి

రానున్న 2024 సర్వత్రిక ఎన్నికలలో ప్రత్తిపాడు టిడిపి అభ్యర్థిగా వరుపుల సత్యప్రభను ప్రకటించడంపై టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేశాయి. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు గురువారం ఆమె పేరును ఖరారు చేయడంతో పలు గ్రామాల్లో టపాసులు పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షులు సత్యనారాయణ, ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపిపి భాస్కర్‌బాబు, జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు సాంబశివరావు, ఎంపిటిసి సభ్యులు సోమరౌతు రవి, కిల్లడ వరహాలు జట్ల రాజా. సింహాద్రి పెదబాబు పాల్గొన్నారు.

14 వరకూ మూల్‌నివాసీల మాసోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా మూల్‌నివాసీల మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈ మాసోత్సవంలో గౌతమ బుద్ధుడు, మహాత్మ జ్యోతిరావు పూలే, నారాయణగురు, అంబేద్కర్, జగజ్జీవన రావు, సావిత్రిబాయి పూలే, రమాబాయి తదితరులు సమాజానికి చేసిన సేవలను యువతకు తెలియజేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - పెద్దాపురం


మండలంలోని దివిలి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా 33/11 కె.విపై శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ ప్రభాకర్ తెలిపారు. దీనివల్ల మండల పరిధిలోని తిరుపతి, చదలాడ, ఉలిమేశ్వరం, కాంద్రకోట, మరలావ, తూర్పు పాకలు, గుడివాడ ,సిరివాడ, పులిమేరు, గోరింట, తాటిపర్తి, దివిలి, చంద్రమాంపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైసిపి గెలుపు కోరుతూ పాదయాత్ర

ప్రజాశక్తి - రౌతులపూడి


వైసిపి అభ్యర్థుల విజయం కోరుతూ మండలంలోని గుమ్మరేగుల గ్రామ సర్పంచ్ రాపర్తి రామకృష్ణ పాదయాత్ర చేపట్టారు. గురువారం గుమ్మరేగుల నుంచి కత్తిపూడి శివారు సీతంపేట వరకూ చేపట్టిన పాదయాత్రలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శంఖవరం ఎంపిపి పర్వత రాజుబాబు, వివిధ గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఐవి రావు

మూత్రపిండాలు (కిడ్నీలు) ఆరోగ్యంగా ఉంచుకోవాలని దానికి సంబంధిత వ్యాధులు వచ్చే టప్పుడు ముందుగా గుర్తిస్తే దాన్ని నివారించుకోవడం చాలా సులభతరమని కాకినాడ అపోలో ఆస్పత్రికి చెందిన వైద్యులు తెలిపారు. గురువారం ప్రపంచ కిడ్నీ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ డాక్టర్ ఐవి.రావు మాట్లాడారు. మనిషి శరీరంలో కిడ్నీ ఒక కీలక అవయవమని, దానిని నిరంతరం ఆరోగ్యంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి కిడ్నీ పనితీరు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. పిల్లల్లో ప్రాథమిక దశలో ఉదయం మొహం వాచినా, సాయంత్రం వేళల్లో కాళ్లు ఉబ్బినా కిడ్నీ పనితీరు సరిగ్గా లేదని తెలుసుకోవాలన్నారు. అలాగే మూత్రం రంగు మారినా కిడ్నీ వ్యాధి సమస్య ఉన్నట్లు గుర్తించాలన్నారు. మూత్ర విసర్జన సరిగ్గా జరగపోవడం వల్ల కిడ్నీలో రాళ్లు పెరిగి కేన్సర్ వ్యాధికి కూడా దారి తీసే ప్రమాదం ఉందన్నారు. అపోలో కిడ్నీ మార్పిడి నిపుణులు డాక్టర్ జివి.రావు మాట్లాడుతూ గత ఏడాది అపోలో ఆసుపత్రిలో 14 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేశామని వారంతా క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఈ కిడ్నీ మార్పిడిపై ఎటువంటి అపోహలు ఉండవద్దని సూచించారు. పొటాషియం, ఫాస్పరస్ అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తినడం తగ్గించాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ తగిన మోతాదులో మంచినీళ్లు తాగాలని బిపి, చక్కర వ్యాధులను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్యులు అనిల్‌కుమార్, కరుణాకర్ రెడ్డి, శర్మిష్ట ప్రాణగ్రిహి, పి.నాగేశ్వరరావు, అపోలో ఎఒ ఐవి.రమణ పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభించాలి



జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ శ్రీనివాస్

ప్రజాశక్తి - కాకినాడ

ఏప్రియల్ ఒకటి నుంచి జిల్లాలో ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం సంఘం జిల్లా కమిటీ సమావేశం కాకినాడ సుందరయ్య భవన్లో జరిగింది. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గత రెండు నెలలుగా పనులు లేక కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపాధి పనులు కూడా అరకొరగానే ఉన్నాయని, దీనివల్ల వ్యవసాయ కూలీలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఏప్రిల్ 1నుంచి అందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడ్జెట్లో నిధులు తగ్గించుకుంటూ పోవవడం వల్ల ఈ పథకంలో పనులు తగ్గిపోతున్నాయని, కేవలం సంత్సరంలో రెండుమూడు నెలలే పనులు జరుగుతున్నాయని విమర్శించారు.

176 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

అక్రమంగా తరలిస్తున్న 176 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు ప్రత్తిపాడు సిఐ చిరంజీవి, ఎస్ఐ ఆశలత సిబ్బందితో జాతీయ రహదారిపై గస్తీ నిర్వహిస్తున్నారు. తుని నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న ఐసర్ వ్యాన్ అనుమానాస్పదంగా కనిపించడంతో కష్టవరం టోల్‌గేట్ వద్ద అడ్డగించి తనిఖీ చేశారు. వ్యాన్ కింద భాగంలో ఆయిల్ ట్యాంకర్ పక్కన ప్రత్యేకంగా అమర్చిన బాక్సులో 84 గంజాయి ప్యాకెట్లను గుర్తించారు. గంజాయి బరువు 176 కిలోలు ఉండగా దాని విలువ రూ.9 లక్షలకు పైగా ఉంటుందన్నారు. వ్యాన్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లాకు చెందిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది వెంకన్నదొర, కష్ణార్జున, దొరబాబు, రాంబాబు, రాజు రామకృష్ణ, సలీం ఉన్నారు.

ఉపాధి పనులు కల్పిస్తాం

ప్రజాశక్తి - కాజులూరు

ఉపాధి పనులను పూర్తిస్థాయిలో కల్పిస్తామని ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ బి. వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎపిఒగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వంద రోజులు పని కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఉపాధి పనుల వద్ద మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు.

ఆర్ అండ్ బి ఎస్ఇగా కాంతు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లా రోడ్లు భవనాలు శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా జి.కాంతు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ కతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన గతంలో ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో డిప్యుటేషన్‌పై పనిచేశారు.

విద్యార్థులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కరప

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు కెనరా బ్యాంకు స్కాలర్‌షిప్‌లు అందించింది. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ వి.మల్లేశ్వరరావు, స్థానిక బ్యాంక్ ఆఫీసర్ జి.బాలాజీ పాల్గొని చెక్కులను విద్యార్థులకు అందించారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి జిళ్లెల నిఖిత, 9వ తరగతి విద్యార్థి దడాల అపరంజిలకు రూ.5 వేలు చొప్పున 7వ తరగతి విద్యార్థి వజ్రపు శ్రీగాయత్రికి రూ.2,500 చొప్పున స్కాలర్‌షిప్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.స్వర్ణరాణి, సుదర్శన్ బాబు, రామమోహన్ టి.శ్రీనివాస్, అనంతలక్ష్మి, కె.ఈశ్వర్, మాణిక్యాంబ పాల్గొన్నారు.

చేనేత సంఘ నాయకుడు అచ్చారావు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వీర్రాజుపేటకు చెందిన సీనియర్ చేనేత సంఘ నాయకులు గొల్ల అచ్చారావు(86) బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులుగా ఆయన 10 సంవత్సరాలు సేవలందించారు. ఆయన విద్యార్థులకు చేనేత పరిశ్రమ అభివృద్ధి, చేనేత వస్త్రాల తయారీలో మార్పులు వంటి అంశాలు వివరించేవారు. ఆయన మృతికి పెద్దాపురం చేనేత సొసైటీ అధ్యక్షులు ముప్పన వీర్రాజు, అంకయ్యపేట గాంధీ చేనేత సహకార సంఘం అధ్యక్షులు టి. సత్యనారాయణ, కౌన్సిలర్లు ఎం. శ్యామ లాంబ,పేరిశెట్టి అంబిక, సొసైటీ డైరెక్టర్లు జలగం వెంకట నాగేశ్వరరావు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి తహశీల్దార్‌గా విద్యపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన పదోన్నతిపై స్థానిక తహశీల్దార్‌గా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్‌ను కార్యాలయం అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడరూరల్

అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 106 హోప్ ఫర్ ఛేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ రెయిన్ బో క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేపట్టారు. పెసిడెంట్ అల్లై బాలా త్రిపురసుందరి అధ్యక్షతన జరిగింది. చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సిహెచ్.వెంకట్రావు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మునిరెడ్డి, వెంకటశివరామకృష్ణ హాజరయ్యారు.

ప్రలోభాలను అరికట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ


ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సాధారణ ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం, ఇతర ప్రలోభాల పంపిణీని సమర్థవంతంగా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వేలెన్స్ టీములు, చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్న వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జరుగనున్న ఎన్నికలను స్వేచ్ఛ, స్వచ్ఛతా యుతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం, బహుమతుల పంపిణీ వంటి ప్రలోభాలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు వివిధ ఎన్ఫోర్స్మెంట్ శాఖల మధ్య పరస్పర సమన్వయం కొరకు ఎన్నికల కమిషన్ రూపొందించిన ఆన్‌లైన్ ఎలక్షన్ సీజుర్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లో పోలీస్, ప్రొహిబిషన్, ఇన్ కమ్ టాక్స్, కమర్షియల్ టాక్స్, రవాణా, స్టేట్ ఆడిట్, అటవీ శాఖలు, ఎస్ఈబి, కోస్ట్ గార్డు, తదితర అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు, బ్యాంకుల నోడల్ అధికారులు విధిగా నమోదు కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మద్యపానం నిషేధం అమలు కోసం నిలదీయాలి

ప్రజాశక్తి - పిఠాపురం



మద్యపానంపై అవగాహన ర్యాలీ

రానున్న ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఇంటింటికీ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తారని ఇంటికి వచ్చే ఆయా రాజకీయ పార్టీ నాయకులను మద్యం నిషేధం అమలు కోసం నిలదీయాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జెవివి నాయకులు ప్రజలకు సూచించారు. గురువారం పట్టణంలోని స్థానిక రామ థియేటర్ వద్ద గల పార్కులో మద్యపానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విచ్చల విడిగా మద్యం అమ్మకాల వల్ల పేదలు మద్యానికి బానిసలై అటు ఇంటిని, ఆరోగ్యాన్ని పాడు చేసుకుం టున్నారని అన్నారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు మద్యపాన నిషేధం అమలును ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మద్యం మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార రాష్ట్ర కమిటీ కన్వీనర్ కెఎంఎంఆర్.ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామారావు, మద్యం మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ, కమిటీ నాయకులు వి.తరుణ్, చంటి, అప్పారావు, గంగబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను మోసం చేసిన జగన్

ప్రజాశక్తి - కాకినాడ, కాకినాడ రూరల్


నిరసన చేస్తున్న టిడిపి శ్రేణులు

సంతలో పశువులను అమ్ముతున్నట్లుగా జగన్ ఎపిపిఎస్‌సి ఉద్యోగాలను అమ్ముకుని నిరుద్యోగులను మోసం చేశారని ప్రొఫెషనల్ వింగ్ కాకినాడ జిల్లా అధ్యక్షులు వనమాడి మోహన వర్మ ఆరోపించారు. ఎపిపిఎస్సి నియామకాల్లో జరిగిన అక్రమాలపై టిడిపి ప్రొఫెషనల్ వింగ్, తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ సభ్యులు గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మోహన్ వర్మ మాట్లాడుతూ ఎపిపిఎస్‌సి ఉద్యోగాలు నియామకంలో జగన్ ప్రభుత్వం భారీ కుంభకోణానికి తెర తీసిందన్నారు. ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్ట్ 2.5 కోట్లకు, ఒక్కో డిఎస్‌పి పోస్ట్ 1.5 కోట్లు రూపాయలు ఆమ్ముకుని నిరుద్యోగ యువతను మోసం చేశారని అన్నారు. ప్రస్తుతం వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 162 మంది నియామకాలు చెల్లవని, మళ్లీ మెయిన్స్ పరీక్ష నిర్వహించి నియామక ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు తీర్పునివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి రవి, నీలకాయలు సన్నీ, చింతా సతీష్, పాలిక సూర్య, నానవరపు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. కాకినాడ రూరల్ మండలంలోని వలసపాకలు వద్ద ఎపిపిఎస్‌సిలో జరిగిన అవినీతికి నిరసనగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, నియోజక వర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎంఎల్ఎ అనంత లక్ష్మి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటరాజు, శీను, శ్రీరామచంద్రుడు, లక్ష్మణ్, జగన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాల భవనం ప్రారంభం

ప్రజాశక్తి - కోటనందూరు


భవనాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్, కృష్ణాజీ

కోటనందూరులో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో నూతనంగా నిర్మించిన ఇంటర్మీడియట్ కాలేజీని భవనాన్ని తుని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, ఎంపిపి లగుడు శ్రీనివాస్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో రూ.72 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించామని అన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ 26 ఏళ్లుగా పాలించిన గత పాలకులు జూనియర్ కాలేజీని తీసుకురాలేకపోయారన్నారు. ఎంఎల్ఎ రాజా, సిఎం జగన్‌తో నేడు అది సాకారమైందన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ జి.రామచంద్రరావు, సర్పంచులు జి.శివలక్ష్మి, ఉపేంద్ర, ఎస్.రాంబాబు, పిఎంసి చైర్మన్ ఉల్లూరి శ్రీను, ఎంపిటిసి సభ్యులు స్వామినాయుడు, ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు, హెచ్ఎం ఎన్.వేణుగోపాల్, సూర్యచంద్ర, రమేష్, గంగాధర్, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా డి.శ్రీకాంత్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఎపి ఎస్‌బిసిఎల్ ప్రధాన కార్యాలయంలో డిజిఎంగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.

వేట్లపాలెం సర్పంచ్ పదవి మూడు నెలలు రద్దు

ప్రజాశక్తి - సామర్లకోట

మండల పరిధిలో వేట్లపాలెం సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మీ పదవిని మూడు నెలల పాటు రద్దు చేశారు. ఈ మేరకు ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణసత్యారెడ్డి గురువారం విలేకర్లకు తెలిపారు. ఈనెల 7వ తేది నుంచి జూన్ 6వ తేదీ వరకు పదవిని రద్దు చేశామన్నారు. ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఉప సర్పంచ్, ఇఒపిఆర్‌డిలకు చెక్‌పవర్ ఇచ్చారన్నారు. ఈ మేరకు గోలి శ్రీరామ్ ఇన్‌ఛార్జి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు.

పోలింగ్ శాతం పెంచడమే స్వీప్ లక్ష్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే స్వీప్ లక్ష్యమని కాకినాడ జిల్లా డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. గురువారం చిన్నబ్రహ్మదేవంలో ఎపిఒ బాబు అధ్యక్షతన జరిగిన ఉపాధి కూలీల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 79.77 శాతం, జాతీయస్థాయిలో 69 శాతం పోలింగ్ నమోదైందన్నారు. త్వరంలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో అధిక శాతం మంది ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన పెంచాలన్నారు. ఈ సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక


పార్టీ కండువా కప్పుతున్న జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - జగ్గంపేట

బిసి నేత బి.అప్పలరాజు గురువారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ టిడిపి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ పార్టీ కండువా కప్పి అప్పలరాజును ఆహ్వానించారు. అలాగే కాట్రావులపల్లికి చెందిన అప్పబత్తుల లోవరాజు, సీతానగరం గ్రామానికి చెందిన కుడప మురళి టిడిపిలో చేరారు. వీరికి జ్యోతుల నెహ్రూ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, ముసిరెడ్డి నాగేశ్వరరావు, సుంకర సీతారామయ్య పాల్గొన్నారు.

కేంద్ర పోలీసు బలగాల కవాతు

ప్రజాశక్తి - గండేపల్లి


కవాతులో పాల్గొన్న పోలీసు అధికారులు

మండలంలోని ఉప్పల పాడు, నీలాద్రి రావుపేట, జెడ్ రాగంపేట, సూరం పాలెం, నాయికం పల్లి, గ్రామాలలో కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. గురువారం జరిగిన ఈ కవాతు ఎస్ఐ ఎన్.రామకృష్ణ పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా సిఐ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రజలంతా ప్రశాంత వాతావ రణంలో తమ యొక్క ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరు ఎటువంటి క్రిమినల్ కేసుల్లో కలుగ చేసుకోరాదన్నారు. ఎన్నికల సమయంలో నమోదయ్యే కేసులు తమ భవిష్యత్‌లో ప్రభావం చూపుతాయని తెలిపారు. ఎన్నికల ప్రశాంత వాతావర ణంలో జరిగేలా ప్రజల సహాయ సహకారం అందించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఎటువంటి అపోహలకు గురికా వద్దని ప్రతి ఒక్కరికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో ఎఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు హక్కుపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని నవర, చంద్రంపాలెం, పి.వేమవరం, పనసపాడు, ఉండూరు, గొంచాల, కాపవరం, అచ్చంపేట గ్రామాల్లో అందరికీ ఇళ్ళు పథకంలో లబ్ధిదారులకు హక్కుపత్రాలను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు పంపిణీ చేశారు. గురువారం ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. నీడ లేని పేదలకు సొంత గూడును కల్పించాలనే లక్ష్యంతో సిఎం జగన్ రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలను అందించారని అన్నారు. రూ. 10 నుంచి రూ.20 లక్షలు విలువ చేసే ఆస్తిని లబ్ధిదారునికి అందించారని తెలిపారు. సంక్షేమమే లక్ష్యంగా గత ఐదేళ్ల పాలన సాగుతుందన్నారు. పేదల కోసం నిరంతరం పనిచేస్తున్న సిఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి సభ్యులు ఎలిశెట్టి అమృత, మండల అధ్యక్షులు బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

పి.నరేష్‌చౌదరి, S/o. సూరిబాబు, మిరపకాయల వీధి, పెద్దాపురం, సెల్: 9000573434 వారు ఇచ్చిన ప్రకటన.

దస్తావేజు పెద్దాపురం SRO No. 1209/2021 (లింక్) పెద్దాపురం మెయిన్‌రోడ్డులో ది. 08-3-2024వ తేదీన పడిపోయినది. దస్తావేజు దొరికినవారు పెద్దాపురం పోలీసు వార్కి గాని, పైన వున్న మొబైల్ నంబరుకు గాని తెలియజేయగలరు.

ఇట్లు:
పి.నరేష్‌చౌదరి
S/o. సూరిబాబు (లేటు)
మిరపకాయల వీధి, పెద్దాపురం
సెల్: 9000573434

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - జగ్గంపేట, సామర్లకోట


సామర్లకోటలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో జనసేన నాయకులు, కార్యకర్తలు అవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలం దరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పిఠాపురం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పవన్ కళ్యాణ్‌ను ఎంత మెజారిటీతో గెలిపించుకుంటామో, అంతే మెజారీటీతో జ్యోతుల నెహ్రూను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న పవన్ కళ్యాణ్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడానికి అందరం కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పాలిశెట్టి సతీష్, వులిసి ఐ రాజ్, మొగిలి గంగాధర్ పాల్గొన్నారు. సామర్లకోటలోని గాంధీనగర్‌లో జనసేన పార్టీ పతాక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మల రామస్వామి (బాబు) మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావాలనే నినాదంతో జనసేన ఆవిర్భవించిందన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అంధకారంలోకి నెట్టిన వైసిపి పాలనను అంతమొందించేందుకే టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడ్డాయన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్పను పెద్దాపురం నియోజకవర్గం నుంచి మరోసారి ఎంఎల్ఎగా గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సరిజా వాసు, మాంచెం సాయి, పిట్టా జానకి రామారావు, అత్తిలి కృష్ణ పాల్గొన్నారు.

టిడిపితోనే బిసిల సంక్షేమం

ప్రజాశక్తి - పెద్దాపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

రాష్ట్రంలోని బిసిల సంక్షేమం టిడిపితోనే సాధ్యమవుతుందని ఎంఎల్ఎ నిమ్మ కాయల చినరాజప్ప అన్నారు. గురువారం మండ లంలోని తాటిపర్తి గ్రామంలో క్లస్టర్ స్థాయి బిసిల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బిసి కులాల వారందరికీ 50 సంవత్సరాలకే పింఛన్ అమలు చేస్తామన్నారు. ప్రతి నెల పింఛను రూ.4 వేలు ఇస్తామన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో బిసిలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. బిసిల రక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువ స్తామన్నారు. సామాజిక న్యాయ పరిశీలన కమిటీ ఏర్పాటు చేసి బిసిల హక్కులు కాపాడుతామని, బిసి సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు వారి అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. చట్టపరంగా కులగణనను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, కొత్తెం వెంకట శ్రీనివాసరావు, మొయిళ్ళ కృష్ణమూర్తి, శ్రీనివాస్, బొడ్డు వెంకన్న, నూనె రామారావు పాల్గొన్నారు.

స్పందించకుంటే దీక్షలు ఆపేది లేదు

ప్రజాశక్తి - తాళ్లరేవు


దీక్ష చేస్తున్న స్థానిక లబ్ధిదారులు

తమ సమస్యపై అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు స్పందించేంత వరకూ తమ దీక్షలను కొనసాగిస్తామని లబ్ధిదారులు స్పష్టం చేశారు. గత 44 రోజులుగా చొల్లంగి సాల్టు భూములు స్థానికులకే ఇవ్వాలని కోరుతూ జరుగుతున్న దీక్షా శిబిరంలో గురువారం అల్లం వీరలక్ష్మి, రాధాకృష్ణ మాట్లాడారు. స్థానికులకు కాకుండా ఇతర నియోజకవర్గానికి చెందిన వారికి స్థలాలు ఇవ్వడం దారుణమన్నారు. తమకు న్యాయం చేయాలని గత 44 రోజులుగా దీక్షలు చేస్తున్నా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ స్పందించకపోవడం ఆవేదన కల్గిస్తుందన్నారు. కార్యక్రమంలో భొమ్మితి శాంతి,

ప్రకటన
మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో
O.S. No. 55/2023

Between:
వాదులు: కొవ్వూరి విజయ నాగ సత్యవతి
AND
ప్రతివాద్లు:
1) కర్రి విజయ శ్రీనివాసరెడ్డి, S/o. రామకృష్ణారెడ్డి, 57 సం॥లు, డో.నెం. 6-8-8, నిడమర్తి వారి వీధి, టి.నగర్, రాజమండ్రి, రాజమండ్రి JCJ.
2) కర్రి రమాదేవి, W/o. విజయ శ్రీనివాసరెడ్డి, 52 సం॥లు, డో.నెం. 6-8-8, నిడమర్తి వారి వీధి, టి.నగర్, రాజమండ్రి, రాజమండ్రి JCJ.

పై నెంబరు దావా నందు వాదికి ప్రతివాదులు ఇవ్వవలసిన దావా ప్రాంశరీ నోట్ల బాకీ రికవరీ నిమిత్తం దాఖలు చేసిన పై నెంబరు దావా నందు ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా అమలు నిమిత్తం ది. **01-4-2024 సం॥ తేదీనకు వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించడమైనదని తెలియజేయడమైనది.

//By Order//
వి.ఎన్.శ్రీనివాసరెడ్డి
వాది తరపు న్యాయవాది
తణుకు, సెల్: 9441035648

స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు

ప్రజాశక్తి - సామర్లకోట




సామర్లకోటలో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ పోల్‌కు విద్యుత్ సరఫరా వస్తూ ప్రమాదం పొంచి ఉన్నట్టు ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. స్థానిక జగ్గమ్మగారి పేట మున్సిపల్ పాఠశాలను ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదం ఉన్న విషయంపై ట్రాన్స్‌కో ఎఇ రమేష్ స్పందిస్తూ గురువారం ఉదయమే సిబ్బందితో పనులు చేపట్టారు. ఎర్త్ పోల్‌కు గల తీగెను మార్పు చేసి ఫేస్ వైర్ తగలకుండా పనులు చేపట్టారు. దానితో స్థానికులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. పొంచివున్న ప్రమాదంపై తక్షణం స్పందించిన అధికారులకు పలువురు ధన్యవాదాలు తెలిపారు.

సైనిక్ స్కూల్‌కి అన్నవరం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - అన్నవరం

సత్యనారాయణ స్వామి దేవస్థానం హైస్కూల్లో చదువుతున్న విద్యార్థి బలువు సత్యవీర లోకేష్ సైనిక స్కూల్‌కి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎం ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక బలువు మల్లేశ్వరరావు, శ్రీదేవి దంపతుల కుమారుడైన సత్యవీర లోకేష్ తమ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడని, అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చే వాడని అన్నారు. సైనిక స్కూల్ ఎంట్రన్స్ పరీక్షలో మొదటిసారి ఉత్తీర్ణత పొందడం విద్యార్థి ప్రతిభకు నిదర్శనమని కొనియాడారు. విద్యార్థి లోకేష్‌ను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

జనసైనికుల సంబరాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారని తెలియడంతో మండలంలో జనసైనికుల సంబరాలు మిన్నంటాయి. గురువారం సాయంత్రం కొత్తపల్లి జనసేన పార్టీ కార్యాలయం వద్ద టపాకాయలు పేల్చి కేకులు కట్ చేశారు.పిఠాపురం నుంచే తాను పోటీ చేస్తానని ప్రకటించడంతో జనసైనికులు సంబరాలు చేసుకున్నారు. తొలిత ఉప్పాడ రింగ్ రోడ్‌లో బాణసంచా పేల్చి ర్యాలీగా కొత్తపల్లి పార్టీ కార్యాలయానికి చేరుకుని జై పవన్ కళ్యాణ్ అంటూ నినాదాలు చేశారు. పిఠాపురం నియోజకవర్గం పవన్ కళ్యాణ్‌కు గుర్తుండే విధంగా అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపుతామని జనసేన నాయకులు తెలిపారు.

వృద్ధుడి ప్రాణాలను కాపాడిన యువకులు

ప్రజాశక్తి - కోటనందూరు


వృద్ధుడిని కాపాడుతున్న యువకులు

మండలంలోని భీమవరపుకోట గ్రామానికి చెందిన అనుకూల రాము(59) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చిన్న బావిలో పడిపోయాడు. ఈ సందర్భంగా ఈ వృద్ధుడు కేకలు వేయడంతో అదే గ్రామానికి చెందిన యువకులు గంట దుర్గాప్రసాద్, కాపారపు రాజశేఖర్, ఊసే బంటసేన నూతిలోకి దిగి ఆ వృద్ధిడిని బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. యువకుల సకాలంలో స్పందించి ప్రాణాన్ని కాపాడిన యువకులను కుటుంబ సభ్యులు, స్థానిక సర్పంచి జగడాల వీరబాబు, ఎంపిటిసి సభ్యులు కొత్తపెళ్లి మాణిక్యాలరావు, మండలం వైసిపి ఉపాధ్యక్షులు అనుకూల రిసార్ట్స్ సామేలు అభినందించారు.

ఇంటింటా ప్రచారంలో 'పంతం'

ప్రజాశక్తి - కరప

మండలంలోని జడ్ బావారం గ్రామంలో జనసేన నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ గురువారం ఇంటింటా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. టిడిపి కో ఆర్డినేటర్ పిల్లి అనంతలక్ష్మి, పార్టీ నాయకుడు పిల్లి సత్యనారాయణ మూర్తి, కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీలతో కలిసి ప్రచారాన్ని చేపట్టారు. గాజు గ్లాసు గుర్తుకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. జనసేన - టిడిపి- బిజెపి ఉమ్మడి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి నారాయణరావు, తుమ్మలపల్లి మాచరావు, భోగి రెడ్డి కొండబాబు, భోగి రెడ్డి గంగాధర్, కోటగిరి మహేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ పని కల్పించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పని కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపిడిఒ జి.ఉషారాణి అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలోఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లుతో పథకం అమలు తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల శాతాన్ని పెంచవలసి ఉందన్నారు. మెట్ట గ్రామాల్లో ఏ విధమైన పనులు లేక అవస్థలు పడుతున్న కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు.

డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి పిఎం ఉచ్ఛరణ శిక్షా అభియాన్ పథకంలో రూ.5 కోట్లు మంజూరు అయ్యాయని ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత తెలిపారు. ఈ నిధులు అదనపు తరగతి గదులు, మౌలిక వసతుల కల్పనకు మంజూరయ్యాయని తెలిపారు. పూర్తి స్థాయి తరగతి గదులతో విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు, సొంత భవనాలలో విద్యాబోధన చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. నిధులు మంజూరుతో అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక పంచాయతీలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్‌సాగర్, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్, ఆకుల వెంకన్న, మోర్త రాంబాబు, ఎంపిటిసి రత్న ముత్యాలు, మండల సేవాదళ్ కన్వీనర్ భూసారపు పద్మారావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 64/2023

వాది: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ప్రక్కిలంక బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై బ్రాంచ్ మేనేజర్
మరియు
ప్రతివాది: చిట్టూరి వేణుగోపాలరెడ్డి

దావా నోటీసు

ప్రతివాది అడ్రసు:
శ్రీ చిట్టూరి వేణుగోపాల్ రెడ్డి, తండ్రి: విశ్వనాధరెడ్డి, పురుషుడు, 56 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 80-33-5, శ్రీనివాస్ నగర్, ఎ.వి.అప్పారావు రోడ్డు, రాజమండ్రి, రాజమండ్రి అర్బన్, తూ॥గో॥జిల్లా.

పై దావా పరిహార నిమిత్తం వాది మీపై దావాను దాఖలు చేసి వున్నారు. సదరు దావాలో మీరు ప్రతివాది అయి వున్నారు. కావున మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ది. **20-3-2024వ తేదీన ఉదయం 10.30 లకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని ఎడల దావాను మీ పరోక్షమందు తీర్మానించెదరు.

వాయిదా తేది: 20-3-2024

పి.ఉదయ భానుజీ
వాది తరపు అడ్వకేట్
కొవ్వూరు, సెల్: 9440536819

ప్రకటన
మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో
O.S. No. 54/2023

Between:
వాదులు: కర్రి చిట్టెమ్మ, వగైరాలు
AND
ప్రతివాద్లు:
1) కర్రి విజయ శ్రీనివాసరెడ్డి, S/o. రామకృష్ణారెడ్డి, 57 సం॥లు, డో.నెం. 6-8-8, నిడమర్తి వారి వీధి, టి.నగర్, రాజమండ్రి, రాజమండ్రి JCJ.
2) కర్రి రమాదేవి, W/o. విజయ శ్రీనివాసరెడ్డి, 52 సం॥లు, డో.నెం. 6-8-8, నిడమర్తి వారి వీధి, టి.నగర్, రాజమండ్రి, రాజమండ్రి JCJ.

వాదులకు ప్రతివాదులు ఇవ్వవలసిన ప్రాంశరీ నోట్ల బాకీ రికవరీ నిమిత్తం దాఖలు చేసిన పై నెంబరు దావా నందు దావా బాకీనకు హామీగా ప్రతివాదులు అయిన మీ తాలూకు పిటీషను షెడ్యూలు దాఖలా ఆస్తిని తోడజప్తు చేయించమని దాఖలు చేసిన I.A. 2/2023 పిటీషను నందు రెస్పాండెంట్లు/ ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు, నోటీసులు పంపించినను అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా అమలు నిమిత్తం ది. **01-4-2024 సం॥ తేదీనకు వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించడమైనదని తెలియజేయడమైనది.

//By Order//
వి.ఎన్.శ్రీనివాసరెడ్డి
వాద్లు/ పిటీషనర్లు తరపు న్యాయవాది
తణుకు, సెల్: 9441035648